సాక్షి మంచిర్యాల

ఆదివారం । 30 । మార్చి । 2025



భూ సమస్యలపై విచారణ

సింగరేణి భూ సమస్యలను నెల రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశంలో, ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. 8లో ▸



నూతన పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

విశ్వావసు అనుకూలమే..!

- నేడు తెలుగువారి తొలి పండుగ ఉగాది
- విశ్వావసు నామ సంవత్సరం ఆరంభం
- పట్టణాలు, గ్రామాల్లో పండుగ సందడి



మంచిర్యాల మార్కెట్‌లో మామిడికాయలు, చింతపండు విక్రయం

మంచిర్యాలఅర్బన్: తెలుగువారి తొలి పండుగ ఉగాది. ఈ ఏడాది విశ్వావసు నామ సంవత్సరం ఆదివారం నుంచి ఆరంభమవుతుంది. విశ్వావసు అంటే విశ్వంలోని సంపద.. విశ్వానికి సంబంధించిన శ్రేష్టత అని అర్థం. తీపి, పులుపు, కారం, ఉప్పు, చేదు, వగరు రుచుల వలే జీవితంలోని అన్ని అనుభూతులను ఆస్వాదించాలనేది ఉగాది పచ్చడి అంతరార్థం. కష్టనష్టాలు.. సుఖదుఃఖాలను సమంగా చూడాలనే సందేశాన్ని ఇస్తుంది. ఉగాది రోజున ఆలయాల్లో పంచాంగ పఠనం ప్రత్యేకంగా నిలుస్తుంది. రాశులవారీగా ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలను అర్చకులు, పండితుల నుంచి తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తారు. నూతన సంవత్సరంగా భావించి ఉగాది రోజున కొత్త కార్యాలు ప్రారంభిస్తే శుభప్రదమని విశ్వసిస్తారు. జిల్లాలోని ఆలయాల్లో భక్తులకు ఏర్పాట్లు చేశారు. విశ్వావసు నామ సంవత్సరం రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులకు అనుకూలంగా ఉంటుందని పండితులు చెబుతున్నారు.

షడ్రుచులతో పచ్చడి..

ఉగాది పండుగ రోజు పంచాంగ శ్రవణంతోపాటు పచ్చడికి విశేష ప్రాధాన్యత ఉంది. ఇది షడ్రుచుల సమ్మేళనం. ఇళ్లను మామిడాకుల తోరణాలు, రంగవల్లులతో అలంకరిస్తారు. వసంతలక్ష్మిని స్వాగతిస్తారు. తీపి(మధురం), పులు పు(ఆమ్లం), ఉప్పు(లవణం), కారం(కటు), చేదు (తిక్త), వగరు(కషాయం) రుచులు కలిసిన పచ్చడి తెలుగువారికి ప్రత్యేకమైనది. ఏడాది పొడవునా ఎదురయ్యే మంచీచెడులు, కష్టసుఖాలను సంయమనంతో స్వీకరించాలని తెలియజేస్తుంది. మామిడికాయలు, వేప పువ్వు, చింతపండు, కొబ్బ రి, బెల్లంతో పచ్చడి తయారు చేస్తారు. ఉగాది రోజున పంచాంగ శ్రవణం, గోపూజ, ఏరువాక ఆచారాలను పాటిస్తారు. పండుగను పురస్కరించుకుని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, మందమర్రి, లక్సెట్టిపేట తదితర పట్టణా ల్లోని మార్కెట్లలో ప్రజల సందడి నెలకొంది. మంచిర్యాలలో సామగ్రిని కొ నుగోలుకు తరలివచ్చారు. గంగారెడ్డి చౌరస్తా నుంచి మార్కెట్ రోడ్‌లో ఏర్పా టు చేసిన తాత్కాలిక దుకాణాల వద్ద మామిడి కాయలు, చింతపండు, వేప పూలు కొనుగోలు చేశారు. స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో పంచంగ శ్రవణ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. బుడి దామోదర్ శర్మ సిద్ధాంతి పంచాంగ శ్రవణ చేస్తారని ఆలయ ఈవో ముక్తా రవి తెలిపారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ


పాతమంచిర్యాల: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు శనివారం పట్టణంలోని తన నివాసంలో శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర నూతన పంచాంగాన్ని ఆవిష్కరించారు. జిల్లా సంఘం అధ్యక్షుడు గోవర్ధనగిరి అనంతాచార్యులు, ప్రధాన కార్యదర్శి ఆచి వెంకట రమణాచార్య, గౌరవ అధ్యక్షుడు చక్రవర్తుల పురుషోత్తమాచార్య, కోశాధికారి కనగర్తి శ్రీనాథాచార్య, రాష్ట్ర కార్యదర్శి కే.సత్యనారాయణాచార్య, భాగవతోత్తములు పాల్గొన్నారు.



‘పంచాంగం’లో ఘనాపాటిలు..

బెల్లంపల్లి: ఉగాది పండుగ విశిష్టతల్లో పంచాంగ శ్రవణం, జ్యోతిష్యానికి ఎంతో ప్రత్యేకత ఉంది. పంచాంగ పఠనం ద్వారా భవిష్యత్‌ను వివరించడం వేద పండితులకు మాత్రమే సాధ్యమవుతుంది. దశాబ్దాలుగా పంచాంగ పఠనం చేస్తూ కొందరు ఘనాపాటిలుగా పేరొందారు.

ఐదు దశాబ్దాలకు పైగా..



నారాయణశర్మ

బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామానికి చెందిన రాంపల్లి నారాయణశర్మ అవధాని గత 55ఏళ్లుగా ఆలయాలు, ఎన్నో వేదికలపై పంచాంగ పఠనం చేస్తున్నారు. భవిష్యత్ కాల పరిస్థితులు, స్థితిగతులు వివరిస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటున్నారు. అష్టగ్రహ కూటమి సంవత్సరంలో ఉగాది రోజున పంచాంగం చెప్పినట్లుగా ఆ ఏటా కరువు సంభవించిందని, మరో ఏటా కలరా వ్యాధి ప్రబలుతుందని, ఇంకో యేడు భారీ వర్షాలు జనజీవనాన్ని, పంటలను అతలాకుతలం చేస్తాయని వెల్లడించగా.. నిజమయ్యాయని నారాయణశర్మ అవధాని తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరంపై ఆయన మాటల్లోనే..‘కందులు, మిర్చి, టమాటా అధికంగా సా గై చేతికందుతాయి. వాతావరణంలో వచ్చే ప్రతికూల పరిస్థితుల్లో గాలి తీవ్రత అధికంగా ఉంటుంది. పశువులకు భారీ ప్రాణనష్టం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో జూలై, సెప్టెంబర్‌లో భారీ వర్షాలు, తుపాన్‌లు వచ్చి నష్టం, కొత్త వ్యాధులు పుట్టుకొస్తాయి. ఆహార ధాన్యాల కొరత, నిత్యావసర వస్తువుల ధరలు రెట్టింపు అవుతాయి..’ అని వివరించారు.

వంశపారంపర్యంగా..



నాగేశ్వర్‌రావు

చెన్నూర్: ప్రాచీన చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచే చెన్నూర్‌లోని అంబా ఆగస్తేశ్వరాలయం(శివాలయం)లో 40ఏళ్లుగా జక్కెపల్లి నాగేశ్వర్‌రావు పంచాంగ శ్రవణం చేస్తున్నారు. శివాలయంలో కొన్నేళ్ల క్రితం జక్కెపల్లి కృష్ణశాస్త్రి అర్చకుడిగా పని చేశారు. ఉగాది రోజున సాయంత్రం పంచాంగ శ్రవణం చేసేవారు. తండ్రి జక్కెపల్లి కృష్ణశాస్త్రి వారసత్వంగా రిటైర్డు ప్రభుత్వ ఉపాధ్యాయుడు జక్కెపల్లి నాగేశ్వర్‌రావు ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుంటాయని, రాష్ట్ర, దేశ రాజకీయాల్లో మార్పులు చోటు చేసుకునే అంశాలు గోచరిస్తున్నాయని వివరించారు.

15ఏళ్లుగా ‘బుడి’ రాత



దామోదర్‌సిద్ధాంతి

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో 15ఏళ్లుగా బుడి దామోదర్ శర్మ సిద్ధాంతి పంచాగ శ్రవణం చేస్తున్నారు. అంతకుముందు ఆయన సోదరుడు బుడి రామయ్య సిద్ధాంతి పంచాంగ పఠనం చేసేవారు. 2011 నుంచి బుడి దామోదర్ శర్మ సిద్ధాంతి పంచాంగం రాస్తున్నారు. పంచాంగంపై దామోదర్ సిద్ధాంతి స్పందిస్తూ.. ‘తెలంగాణ ఉద్యమ కాలంలో ఉగాది రోజున తెలంగాణ జేఏసీ వేదికపైన పంచాంగ శ్రవణంలో 2014 వరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతుందని చెప్పా నిజమైంది. ఏదో ఒక అంతుచిక్కని వ్యాధి(కరోనా)తో జననష్టం జరుగుతుందని కూడా ముందే చెప్పాను. కొత్త సంవత్సర గ్రహస్థితులను బట్టి రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగడంలో స్వపక్ష, ప్రతిపక్ష వ్యక్తుల నుంచి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది..’ అని తెలిపారు.

కార్పొరేషన్ బడ్జెట్ రూ.66.32 కోట్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా బడ్జెట్‌కు ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆమోదం తెలిపారు. రెవెన్యూ, ఖర్చులు, డిపాజిట్లు, రుణాలు, కాపిటల్ ప్రాజెక్టు ఫండ్స్ అన్నీ కలిపి రూ.66.32కోట్లు అంచనా బడ్జెట్‌గా ఆమోదం లభించినట్లు కమిషనర్ శివాజీ పేర్కొన్నారు. మంచిర్యాలలో నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలను విలీనం చేసి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయగా మొదటిసారి బడ్జెట్‌ను రూపొందించారు. కార్పొరేషన్‌కు వచ్చే రెవెన్యూ రూ.46.75 కోట్లు, డిపాజిట్లు, లోన్ల ద్వారా రూ.36 లక్షలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులు రూ.19.21 కోట్లుగా అంచనా వేశారు. ఇందులో జీతాలు, పారిశుద్ధ్యం మెరుగు, కరెంటు బిల్లులు, రుణాల చెల్లింపులు, హరిత బడ్జెట్‌కు రూ.28.31 కోట్లు, ఇంజినీరింగ్ పనుల ఖర్చులు, టౌన్‌ప్లానింగ్ ఖర్చులు, జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఖర్చులు రూ.10.91 కోట్లుగా కేటాయించారు.

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


వినయ్ (ఫైల్)

రామకృష్ణాపూర్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని అబ్రహంనగర్‌కు చెందిన బొమ్మన వినయ్(21), బీజోన్ ఏరియాకు చెందిన ఓ యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి తేవడం, ఏదైనా ఉద్యోగం వస్తేనే పెళ్లిచేస్తానంటూ వినయ్ తల్లి స్పష్టంచేయడంతో ఎటూ పాలుపోక శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతే లక్ష్యం


మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

జైపూర్: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జైపూర్ మండల కేంద్రంలోని ఎస్టీపీపీని సభ్యులు రేణికుంట ప్రవీణ్, ఉస్రురం నీలాదేవి, నేనావత్ రాంబాబునాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లాల శంకర్‌తో కలిసి శనివారం సందర్శించి అధికారులతో చర్చించారు. జీవో 59 ప్రకారం ఎస్సీ,ఎస్టీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం చైర్మన్, సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులు, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, వోఅండ్ఎం చీఫ్ జెన్ సింగ్, పవర్‌మేక్ కంపెనీ హెడ్ అఖిల్‌కపూర్, ఎస్సీ లైజనింగ్ అధికారి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మరింత వృద్ధి చెందాలి

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ మరింత వృద్ధి చెందాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆకాంక్షించారు. శనివారం ఆర్కే న్యూటెక్ గనిలోకి దిగి పనిస్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు వినతిపత్రాలు అందించారు. ఏరియా ఎస్‌వోటు జీఎం ఎస్.సత్యనారాయణ, ఏజీఎం రాజేందర్, డీజీఎం (పర్సనల్) పీ.అరవిందరావు, గని మేనేజర్ స్వామి రాజు, సింగరేణి ఎస్సీ లైజన్ ఆఫీసర్ కిరణ్ కుమార్, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సంక్షేమాధికారి పాల్ సృజన్ పాల్గొన్నారు.

తెలుగుదనం ఉట్టిపడేట్టు

- ఆహార్యంలో పంచకట్టు ఠీవీ..
- ప్రత్యేకత చాటుకుంటున్న ఉమ్మడి జిల్లా వాసులు



పంచకట్టు.. సంప్రదాయ వస్త్రధారణ. కాలంతో పాటు వస్త్రధారణ మారినా.. తెలుగుదనం ఉట్టిపడేది మాత్రం పంచకట్టుతోనే. వృత్తులు, విధులు, ఉద్యోగాల రీత్యా వస్త్రధారణ వేరుగా ఉంటుంది. అయినా ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు నేటికీ సంప్రదాయ పంచకట్టులో ఠీవీ చాటుకుంటున్నారు. సంస్కృతి, సంప్రదాయాన్ని భావితరాలకు అందిస్తున్నారు. వస్త్రధారణ ఆధారంగానే 'మాది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా'.. మేం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులం' అని చెప్పకనే చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు రైతులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు తెలుగుదనం ఉట్టిపడేలా ఇప్పటికీ తెల్లని చొక్కా, ధోవతి, కండువా ధరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తెలుగు సంస్కృతిని చాటి చెప్తున్నారు.

పెద్దల నుంచి వస్తున్న ఆచారం


కేమ లక్ష్మణ్

తాంసి: తెలుగుదనం ఉట్టిపడేలా, నిండు గంభీరంగా కనిపిస్తున్న ఈ రైతు తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన కేమ లక్ష్మణ్. దశాబ్దాల నుంచి ప్రతీరోజు తెల్లని చొక్కా, ధోవతి, కండువా ధరించి తెలుగు రైతుకు నిర్వచనంలా కనిపిస్తాడు. తమది వ్యవసాయ కుటుంబమని, తమపెద్దలు ఆచరించినట్లుగా తాను కూడా తెలుగు రైతు సంప్రదాయాన్ని కచ్చితంగా పాటిస్తూ ఉంటానని పేర్కొంటున్నాడు.

సంప్రదాయం మరవలేదు


మల్లెపూల నర్సయ్య

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన మల్లెపూల నర్సయ్య తెలుగు సంస్కృతికి అద్దంపట్టేలా 40 ఏళ్లుగా పంచెకట్టు (ధోవతి) ధరిస్తున్నాడు. 1981లో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. రాజకీయాలపై మక్కువతో కాంగ్రెస్‌లో చేరి 2001, 2019లో బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఉన్నత చదువులు చదివినా రాజకీయాల్లో రాణిస్తున్నా తెలుగు సంప్రదాయ కట్టుబాట్లను ఇప్పటికీ ఆచరిస్తున్నారు.

తెలుగులోనే సంతకం


భవాని ఆనంద్

బోథ్: మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు భవానీ ఆనంద్ అర్లి బి గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రం బోధిస్తున్నారు. అతనికి చిన్నతనం నుండి తెలుగు భాష అంటే అభిమానం. అందరూ ఇంగ్లిష్‌లో సంతకం చేస్తున్నా తనుమాత్రం 40 ఏళ్లుగా తెలుగులోనే చేస్తున్నారు. తెలుగుపై తనకున్న అభిమానం చాటుకుంటున్నారు.

పంచకట్టుతోనే పాఠాలు


తుమ్మల మల్లారెడ్డి

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలకు చెందిన అవిశ్రాంత తెలుగు అధ్యాపకుడు తుమ్మల మల్లారెడ్డి తెలుగుదనం ఉట్టిపడేలా పంచెకట్టు ధరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో డైట్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ 2000 సంవత్సరంలో ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఇంట్లో కూర్చోవడం ఇష్టం లేక తనుకున్న జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. తెలంగాణలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు వెళ్లి విద్య–నీతి–విలువలపై విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. తెలుగు భాషా పరిరక్షణలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు. ఈతరం మాస్టార్లు కూడా పంచెకట్టు (ధోవతి) సంప్రదాయం కొనసాగించాలని సూచిస్తున్నాడు.

ఆమని రుతురాగం



వయ్యారాల వసంతపు
రాక ఓరమ్యము!
మావిచిగురు తిన్న కోయిల
గొంతు
శ్రావ్యము!!
నింబ కుసుమ సుగంధం
ముక్కుపుటాలకో మురిపెము!
మదినిండా మధుమాసపు కుహూరవాల
కులుకులు!!
ఆమని రుతురాగాల పోరు
ఏమని వర్ణించగలము?!
చెరుకు రసస్వాదనలో
తీయదనం ఎంతని చెప్పగలం?!
మమకారపు మాధుర్యంలో
అలంకారపు అనుభూతులెన్నో?!
వలపు మలుపులోని గెలుపు గమ్యంలోన
పులుపు తోని చింతలన్నీ తీరిపోవా?!
పొగరులోని వగరు జిగురు
అంటించుకుంటే వదులుతుందా?!
తప్పొప్పులను విప్పి వివరిస్తూ
పౌరుషపు రుచిని ఉప్పు అప్పుజెప్పలేదా?!
చేదు జ్ఞాపకాలు మరిచిపోయి
ఆనందంతో..ఆత్మీయతతో..అప్యాయంగా
ఆహ్వానం పలుకుదాం ఉగాదికి!!

– అల్లాడి శ్రీనివాస్, సాహితీ రక్షణ సంస్థ ప్రధాన కార్యదర్శి, సేకరణ: మంచిర్యాలఅర్బన్

నవ ఉగాది..చెలిమి చేయ యుగాది..



మన పయనం చెడు నుంచి మంచికైతే ఉగాది
మన మాటలు ద్వంద్వార్థం కానివైతే ఉగాది
మన చేతలు పదిమందికి
మేలొనగితే ఉగాది
మన చేతులు సృజనశీలి వెన్నుతడితే ఉగాది
మన వేషం యువతకు ఆదర్శమైతే ఉగాది
మన నవ్వులు అపహాస్యం కానివైతే ఉగాది
మన నడకలు నిస్వార్థపు అడుగులైతే ఉగాది
మనభాషణ సౌరభాలు వెదజల్లితే ఉగాది
చేరిందొక వసంతం కాలగర్భంలోకుహరంలో
దూరెను నవ వసంతం రత్నగర్భ సమరంలో
ఊహిస్తూ ఊరిస్తూ ఊసులెన్నో మోసుకొస్తూ
నిర్ణయాలకూపిరిగా నిశ్చయాల తెంపరిగా
వచ్చెను నవ ఉగాది..
తీపి చేదు జ్ఞాపకాలు చెలిమి చేయ యుగాది

– సంతోష్ భూపతి, కవి, మంచిర్యాల
సేకరణ: మంచిర్యాల అర్బన్

క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు

కోపాలకు తాపాలకు నెలవైన క్రోధి నామ సంవత్సరమైతే నేమి
కష్టనష్టాలు కలగలుపుకొని కాలిడితే నేమి
ఆనందోత్సాహంతో ఆహ్వానించి ప్రశాంత జీవన విధానాన్ని
కొనసాగించి సహృదయంతో క్రోధినామకు
వీడ్కోలు పలుకుతూ..
విశ్వ మానవాళి శ్రేయస్సు గోరే వసుధైక కుటుంబంగా
తీర్చిదిద్దే విశ్వావసు నామ సంవత్సరానికి
స్వాగతం సుస్వాగతం..
ఈ నూతన తెలుగు సంవత్సరం దేశ ప్రజలంతా
దేదీప్యమానంగా వెలుగొందాలని, పాడి పంటలు
సమృద్ధిగా ఉండాలని
వరుణదేవుడు కరుణించి సస్య సంపద
నివ్వాలని,
ప్రకృతి పరవశించి ప్రజలను
ఆరోగ్యంగా ఉంచాలని,
దేశ సంపద పెంపొందాలని,
సర్వ మానవ సౌభ్రాతృత్వం
ఐహికాముష్మిక పురోభివృద్ధికి తోడ్పడాలని,
కుల,మత రాజకీయ రగడలు లేకుండా సోదరభావంతో మెలగాలని కాంక్షిస్తూ..
విశ్వావసు నామ నూతన సంవత్సర ఉగాదికి
ఆహ్వానం పలుకుదాం.



– జంబోజు లింగమూర్తి, వెల్గనూర్, దండేపల్లి మండలం – సేకరణ: దండేపల్లి

ఉగాది సౌభాగ్యం



ఆకులన్నీ రాలిపోయి కొత్త
చిగురు మొలిచి
బాధలన్నీ మాసిపోయి
సంతోషం చిగురై నిలిచే
వచ్చే వచ్చే వసంతమై వసుధకు వన్నెలు అద్ది
ఊరంతా ఉగాదియై ఉత్సాహం ఊపులద్ది
చెట్లన్నీ చిగురు తొడిగి విశ్వావసును
స్వాగతించే
మామిడాకు తోరణమై
గుమ్మానికి ముందు నిలిచే
నేడే ఉగాది పర్వదినం విశ్వావసు
నామవత్సరం
రైతన్నలు ఆరుకుంటూ అరకలతో అడుగులేసే
ఆరు రుచుల కలయిక ఆద్యంతం రసభరితం
నవరసాల మిశ్రమం పంచాంగాల శ్రవణం
కష్టసుఖాల జీవితం మంచి చెడుల సందేశం
మాధుర్యం మన సంప్రదాయం
అంబరాల సంబరం

రచన: ముత్తే వెంకటేశ్, రచయిత
తెలుగు పండిత్, బెల్లంపల్లి
సేకరణ: బెల్లంపల్లి

శ్రీ విశ్వావసు ఉగాదికి స్వాగతం..



కొత్తగా కూయవే
కొంగొత్తగా కూయవే
ఈ చైత్రమాసంలోనా
అ మావిచిగురు చాటుగా ప్రేమరాగమై
కూయవే
నిన్నటికి సృష్టియే నేటితో కొత్తగా మొదలైనది
నాయద భావాలను మీటచూ
వసంత రాగమై కూయవే
కొత్త పాతల సమ్మేళనమే మంచి
చెడులే మిళితమై
చేదు తీపి వగరులన్నీ జీవితమంటే ఇది
పరమార్థమని
జీవనరాగమై కూయవే
చిగురు తొడిగే కొత్త ఊహల
విశ్వఉగాది రాగమై
మనసులేని ఈ మరమనుషుల
కృత్రిమ రాగమై కూయవే

– దండనాయకుల వామన్‌రావు,
ఉపాధ్యాయుడు
సేకరణ: మంచిర్యాల అర్బన్

నవ వసంతానికి స్వాగతం..

తూరుపు పర్వతం అంచున
ప్రభాతం అందంగా ఉదయిస్తుంటే..
కొండ గుండెపై కోయిలమ్మ సుస్వరం
సుప్రభాతమై కూస్తుంటే..
వేకువ వాకిట్లో వాలిన తొలిపొద్దు
ముద్దు ముద్దుగా ముగ్గులు
వేస్తుంటే..
పారే సెలయేటి నీటి అలలపై
చిరుగాలి సరిగమలు రాస్తుంటే..
మావి కొమ్మపై పక్షుల కిలకిలా రాగాలు
కరతాళ ధ్వనులు చేస్తుంటే..
ఆకాశ గుమ్మానికి ఉషా కిరణాలు
తోరణాలు కట్టి అలంకరిస్తుంటే..
అవని ఎదపై పచ్చిక పచ్చని తివాచీ పరిచి
వేపపువ్వులతో వేచి చూస్తుంటే..
మబ్బుల తీగకు పూసిన మంచుపూలు
దారి పొడవునా చేరి స్వాగతిస్తుంటే..
మునుపటి గురుతులన్నీ
కడపటి యేటి గుండెల్లో దాచేసి..
నిన్నటి చేదు జ్ఞాపకాలను
రేపటి తీపి వ్యాపకాలతో తుడిచేసి..
కాలం కలమై రాస్తున్న
కావ్యంలో
సరికొత్త పేజీగా
ఒదిగి పోవటానికి
సంబరంగా
ముస్తాబై వస్తున్న..
తెలుగు నూతన సంవత్సరాది
ఆరు రుచుల సమ్మేళనాల ఉగాదికి
ఆనందంగా స్వాగతం పలుకుతూ..



– దాసరి జనార్దన్, చింతపల్లి,
దండేపల్లి మండలం సేకరణ: దండేపల్లి

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ సమీపంలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు (60) మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎరుపురంగు జాకెట్, గులాబీరంగు చీర ధరించి ఉందని, మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. తెలిసినవారు 8712656534, 8712656535 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అర్ధరాత్రి పోకిరీల వీరంగం

- ఒకరిపై దాడి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో పరస్పర దాడులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రెండు రోజుల కిత్రం స్థానిక ఏలైట్ బార్‌లో మద్యం మత్తులో బీరు సీసాలతో దాడులకు పాల్పడిన ఘటన మరువక ముందే శుక్రవారం రాత్రి కొందరు వ్యక్తులు జిల్లా కేంద్రలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డైమండ్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో వీరంగం సృష్టించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు హమాలివాడకు చెందిన కుంట రాజేంద్ర ప్రసాద్, బద్రి ధర్మతేజ, వికాస్‌నగర్‌కు చెందిన సాజన్ మద్యం మత్తులో బస్టాండ్ సమీపంలోని డైమండ్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్దకు వచ్చి బూతులు తిడుతుండడంతో లోపల ఫాస్ట్‌ఫుడ్ తింటున్న ఎక్బాల్‌హైమద్ నగర్‌కు చెందిన సయ్యద్ ముస్సేబ్ అలీ జోక్యం చేసుకోవడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పరస్పర దాడులకు సిద్ధం కావడంతో హమాలివాడకు చెందిన బింగి సాయిని పిలిపించి సయ్యద్ హుస్సేన్‌పై దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని లాఠీ ఝులిపించడంతో పారిపోయారు. ఘటనకు కారకులైన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై సీఐని ప్రమోద్‌రావును వివరణ కోరగా గొడవ జరిగింది వాస్తవమేనని, సయ్యద్ ముస్సేబ్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ వివరించారు.

సింగరేణి భూ సమస్యలపై విచారణ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో సింగరేణికి సంబంధించిన భూ సమస్యలపై సమగ్ర విచారణ జరిపి నెల రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల జనరల్ మేనేజర్లు శ్రీనివాస్, దేవేందర్, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సింగరేణి ఓసీపీలో భాగంగా జైపూర్ మండలం గుత్తేదారుపల్లె గ్రామంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం త్వరగా అందేలా చూడాలని తెలిపారు. సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ నవనీత, కలెక్టర్ సీ సెక్షన్ పర్యవేక్షకులు సంతోష్ పాల్గొన్నారు.

పనుల పర్యవేక్షణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను కలెక్టర్ కుమార్ దీపక్ పర్యవేక్షించారు. రోడ్లు, భవనాల శాఖ ఏఈఈ అనూషా, కళాశాల ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ సంపూర్ణరావు ఉన్నారు.

కులమతాలకు అతీతంగా పండుగలు

మంచిర్యాలటౌన్: కులమతాలకు అతీతంగా పండగలు జరుపుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, మంచిర్యాల తహశీల్దార్ రఫతుల్లా, ముస్లిం పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో దొంగల హల్‌చల్

- అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి దూరిన అగంతకులు
- బంగారం, వెండి, నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు అపహరణ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. రెండిళ్లలో చొరబడి బంగారం, వెండి, నగదుతో ద్విచక్రవాహనాలపై పారిపోయిన ఘటన కలకలం రేపింది. బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దీన్, బాధితుల కథనం ప్రకారం... కాల్‌టెక్స్ ఏరియాలోని ఓ వీధిలో అర్ధరాత్రి సుమారు 2గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల గృహ ప్రవేశం చేసిన బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుడు సాన శ్రావణ్ ఇంటితాళం పగుల గొట్టి లోనికి ప్రవేశించారు. శ్రావణ్, అతని భార్య, పిల్లలు మాస్టర్ బెడ్‌రూమ్ గదిలో నిద్రించగా అగంతకులు మరో గదిలో దూరి బీరువాలో ఉన్న 14.1/2 తులాల బంగారం, కిలోన్నర వెండి ఆభరణాలు, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. అక్కడి నుంచి పక్కనే ఉన్న అత్తె సుధాకర్ ఇంటికి వెళ్లారు. తాళం పగులగొట్టి ప్రవేశించారు. 5 తులాల బంగారం, రూ.70వేలు చోరీ చేశారు. అనంతరం అదే వీధిలోని శ్రీనివాస్, రమేశ్, చంద్రశేఖర్, శ్రావణ్ ఇళ్ల ఎదుట పార్కింగ్ చేసి ఉన్న నాలుగు బైక్‌లను ఎత్తుకెళ్లారు. సాన శ్రావణ్ ఉదయం 5:30 గంటల ప్రాంతంలో నిద్రలేచి చోరీ జరిగిన విషయం గుర్తించాడు.

ఘటనాస్థలిని సందర్శించిన ఏసీపీ...

చోరీ జరిగిన ఇళ్లను శనివారం బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ పరిశీలించి వివరాలు సేకరించారు. సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై మహేందర్‌కు సూచనలు చేశారు. డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి జాగిలాలతో వెతికారు. క్లూస్ టీమ్ వచ్చి వేలి ముద్రలు, ఇతర నమూనాలు సేకరించారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. దొంగలను వెంటనే పట్టుకోవాలని పోలీసు అధికారులను కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇల్లు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుధాకుర్థులో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. గ్రామంలోని పెద్దపల్లి మల్లయ్యకు చెందిన ఇంట్లో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.6 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది. ఎంపీడీవో మహేందర్, కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి పరామర్శించారు.